www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 7 అక్టోబర్ 2025
5
ఏలూరు

ఐసిసిఎస్‌టిటిడబ్ల్యుఐ ఎపి జనరల్ సెక్రటరీగా విజయ్

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని చేగొండపల్లి గ్రామానికి చెందిన వ్యాపారవేత్త బుక్కే విజయ్‌కుమార్‌నాయక్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ ఫర్ ఎస్‌సి, ఎస్‌టి ఉమెన్ ఎంటర్‌ప్రైనర్స్ ఫర్ ఆంధ్ర ప్రదేశ్ ఎగ్జిక్యూటివ్ కమిటీకి జనరల్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఇందుకు సంబంధించి సౌత్ ఇండియా కోఆర్డినేటర్ సి.ఆదినారాయణ ఉత్తర్వులను జారీ చేశారు. ఐసిసి ఎస్‌టి డబ్ల్యుఐ ఎపి జనరల్ సెక్రటరీ విజయ నాయక్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. విజయ్‌నాయక్ మాట్లాడుతూ తనకు అప్పజెప్పిన బాధ్యత పట్ల అంకితభావంతో పని చేస్తానని ఆంధ్రప్రదేశ్‌లోని ఎస్‌సి, ఎస్‌టి మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడానికి వారి ఎదుగుదలకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని విజయ్ కుమార్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా సౌత్ ఇండియా కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

చచ్చినా.. చావే..!

మండలంలోని పలు హిందూ, క్రైస్తవ, బిసి శ్మశానవాటికల్లో సౌకర్యాలు కొరవడ్డాయి. ఏ శ్మశానవాటిక చూసినా తుప్పలు, పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి. కనీసం కూర్చోవడానికి షెడ్లు లేకపోవడంతో ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ అంత్యక్రియలు చేయడానికి నానా అవస్థలు పడుతున్నారు. పలు గ్రామాల్లో శ్మశానాలకు సరైన రహదారి సౌకర్యం లేదు. దశాబ్దాల క్రితం శ్మశానాలకు కేటాయించిన స్థలం సరిపోక ప్రజలు అంత్యక్రియలకు నానా పాట్లు పడుతున్నారు. చినుకు పడితే దుస్థితి వర్ణనాతీతం.

అంత్యక్రియలకు మృతదేహంతో పంట బోదె దాటి వెళ్తున్న కరుగోరుమిల్లి కాలనీవాసులు

శ్మశానవాటికల్లో సౌకర్యాలు కరువు
అంత్యక్రియలకు ప్రజల అవస్థలు
కరుగోరుమిల్లి కాలనీ వాసుల పరిస్థితి మరింత దయనీయం

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట మండలంలోని 12 గ్రామాల్లో 28 నోటిఫైడ్ హిందూ, క్రిస్టియన్, బిసి, శ్మశానవాటికలు ఉన్నాయి. ఒకటి అర మినహా ఎక్కడా శ్మశానాల్లో వసతులు లేని పరిస్థితి. వీటి నిర్వహణ బాధ్యత గ్రామ పంచాయతీలదే అయినా పూర్తిగా గాలికొదిలేశాయి. ఆచంటలో సంత సమీపంలోని పెదపేట శ్మశానవాటిక పిచ్చిమొక్కలతో అధ్వానంగా తయారైంది. అంత్యక్రియలకు వెళ్లాలంటే సరైన రోడ్డు సౌకర్యం లేని పరిస్థితి. వెలగలేటిలో పంట బోదెను దాటుకుని శ్మశానవాటికకు వెళ్ళాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత టిడిపి హయాంలో 1.20 ఎకరాల స్థలం కొనుగోలు చేశారు. నిధులు పూర్తిస్థాయిలో విడుదలకాకపోవడంతో శ్మశానవాటికలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. ప్రహరీ నిర్మాణం పనులు సైతం మధ్యలోనే నిలిచిపోయాయి. ఆచంట శివారు గోగులమ్మ పుంత, మాకేవారిపాలెం వెళ్లే రహదారిలోని హిందూ శ్మశానవాటికలు రైతుల ఆక్రమణలకు గురయ్యాయి. వల్లూరులో శ్మశానవాటికకు స్థలం కొనుగోలు చేస్తామని టిడిపి ప్రభుత్వ హామీ ఇచ్చినా ఫలితం లేదు. ఆచంట వేమవరంలో శ్మశాన స్థలం లేక సమీపంలోని నక్కల డ్రెయిన్ పరివాహక ప్రాంతంలోనే అంత్యక్రియలు నిర్వహించాల్సిన పరిస్థితి. కోడమంచిలి, కరుగోరుమిల్లి, పెనుమంచిలి, భీమలాపురం గ్రామాల్లోని శ్మశానవాటికల వద్ద షెడ్లు, వసతులు లేక అంత్యక్రియలు నిర్వహించడానికి ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

కరుగోరుమిల్లి కాలనీ వాసుల పరిస్థితి దయనీయం..

కరుగోరుమిల్లి గ్రామ పరిధిలోని ముత్యాలవారిపాలెం ఎస్‌సి కాలనీ వాసుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. కాలనీలో సుమారు 200 కుటుంబాలు వారు నివాసం ఉంటున్నారు. వీరికి శ్మశానవాటిక లేదు. కాలనీలో ఎవరైనా చనిపోతే కర్మకాండలు నిర్వహించడానికి వారు పడే పాట్లు వర్ణనాతీతం. కాలనీ ఆనుకొని బ్యాంక్ కెనాల్ ఉంది. పంట కాలువపై వంతెన నిర్మించాలని స్థానికులు కోరుతున్నా పట్టించుకునే నాథుడు లేడు. దీంతో వారు బ్యాంక్ కెనాల్‌పై ఏర్పాటు చేసుకున్న చిన్నపాటి సిమెంటు స్తంభాల మీదుగా మృతదేహాన్ని నెత్తిన పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ పంట కాలువ దాటి గోదావరి తీరానికి అంత్యక్రియలు నిర్వహించడానికి వెళ్తున్నారు. ఈ సందర్భంలో ఒకసారి పంట కాలువలోకి బోల్తా పడి గాయపడిన సందర్భాలు సైతం ఉన్నాయి. ప్రభుత్వం స్పందించి శ్మశానవాటికల వద్ద సౌకర్యాలు కల్పించి ఇబ్బందులు తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అర్జీల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

కలెక్టర్ కె. వెట్రిసెల్వి

ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

పిజిఆర్ఎస్‌లో ప్రజలు సమర్పించిన అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లాస్థాయి అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వితో పాటు జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, ఆర్‌డిఓ అచ్యుత్ అంబరీష్, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకీదేవి, సర్వే ఎడి అన్సారీ అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ఆయా శాఖల వారీగా వచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అర్జీల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు, ఉద్యోగులు అంకిత భావంతో పనిచేయాలని ఆదేశించారు. పిజిఆర్ఎస్‌లో ప్రజల నుంచి అందిన అర్జీల పరిష్కార సరళిపై దృష్టి సారించాలన్నారు. పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా నిర్వహించి క్షేత్రస్థాయిలో ఉత్పన్నమయ్యే సమస్యలకు క్షేత్ర స్థాయిలోనే పరిష్కార మార్గాలు చూపించి అర్జీలు రీ-ఓపెన్‌కు ఆస్కారం లేకుండా చూడాలన్నారు.

అందిన అర్జీల్లో కొన్ని..

పెదపాడు మండలం చిన్న సత్యవోలు గ్రామానికి చెందిన సింగవరపు వెంకట అప్పారావు తన భూమి (గ్రామ సర్వే ఆర్ఎస్ నెం.453 పక్కన ఉన్న భూమిలో) కొందరు చేపల చెరువు తవ్వుతున్నారని, దీంతో చుట్టుపక్కల ఉన్న తమ అపరాల పంటలకు నష్టం వాటిల్లుతుందని, అధికారులు పరిశీలించి తమకు నష్టపరిహారం అందించాలని అర్జీ అందజేశారు. ఏలూరుకు చెందిన దొండపాటి విశాల్ ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కాలేజీలో బిటెక్ మొదటి సంవత్సరం పూర్తిచేశానని, తనకు అనారోగ్యం, కుటుంబ పరిస్థితుల దృష్ట్యా ప్రస్తుతం తాను గోపన్నపాలెం పిఆర్ కాలేజీలో చేరానని, అయితే ఇంజనీరింగ్ కాలేజీలో మొదటి సంవత్సరం పూర్తిచేసిన బిటెక్ సర్టిఫికెట్ ఇవ్వమని అడిగితే కాలేజీ వారు రూ.75,000 కడితేనే ఇస్తామని చెబుతున్నారని, న్యాయం చేయాలని విద్యార్థి కోరాడు. టి.నర్సాపురం మండలం మక్కినవారిగూడెంకు చెందిన చక్రపు సాయమ్మ కుమారుడికి తన ఇల్లు, స్థలం రాసి ఇచ్చానని అప్పటి నుంచి తనను పట్టించుకోవడం లేదని, ఇచ్చిన ఇల్లును, స్థలాన్ని తిరిగి తనకు ఇప్పించాలని అర్జీ అందజేసింది. పిజిఆర్ఎస్ కార్యక్రమంలో మొత్తం 248 దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏలూరును స్వచ్ఛాంధ్రగా తీర్చిదిద్దేందుకు కృషి

జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి


అవార్డులు అందజేస్తున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్, కలెక్టర్, మేయర్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లాను స్వర్ణ ఏలూరు - స్వచ్ఛ ఏలూరుగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. స్థానిక సిఆర్ రెడ్డి కళాశాల ఆడిటోరియంలో సోమవారం సాయంత్రం జరిగిన జిల్లాస్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డులను జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, వివిధ శాఖల అధికారులతో కలిసి అందజేశారు. ముందుగా కార్యక్రమాన్ని కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, నగర మేయర్ షేక్ నూర్జహాన్ జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ అధికారులు, ప్రజలు కలిసికట్టుగా మనసు పెట్టి పనిచేస్తే స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో అన్ని విభాగాల్లోనూ రాష్ట్ర స్థాయి అవార్డులు సాధించి ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డులు తీసుకోవచ్చునన్నారు. ప్రస్తుతం ఏలూరు జిల్లా రాష్ట్ర స్థాయిలో 2, జిల్లా స్థాయిలో 51 స్వచ్ఛ అవార్డులు సాధించిందన్నారు. రానున్న స్వచ్ఛ అవార్డుల సమయానికి ప్రస్తుతం సాధించిన అవార్డులకు రెట్టింపు అవార్డులు సాధించేలా లక్ష్యాలను నిర్దేశించుకుని లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. జనవరి, 1వ తేదీ నాటికి జిల్లాలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సింగల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం పూర్తిస్థాయిలో నియంత్రించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సంక్రాంతి నాటికి జిల్లాలో నూరుశాతం ఇంటింటికీ తడి, పొడి చెత్త సేకరణ చేయాలని, సేకరించిన తడి, పొడి చెత్తను వేరుచేసి, తడిచెత్తను కంపోస్ట్ ఎరువుగా మార్చాలన్నారు. ప్రతి ఇంటిలోనూ తడి చెత్తను హోమ్ కంపోస్ట్‌గా మార్చి, మొక్కలకు ఎరువుగా వినియోగించేలా ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. పట్టణ ప్రాంతాలలో 3 వేల ఇళ్లు, గ్రామీణ ప్రాంతాల్లో 5 వేల ఇళ్లల్లో హోమ్ కంపోస్ట్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 50 వేల ఇళ్లల్లో కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు చేసుకునేలా చూడాలని, జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఘన వ్యర్థాల నిర్వహణ షెడ్లు ఏర్పాటు చేయాలని, ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని డంపింగ్ యార్డులో 80 వేల టన్నులకు పైగా ఉన్న వ్యర్థాలను నిర్వహణ చేసి తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షపు నీటి నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర నిరంతర కార్యక్రమాన్ని సంపూర్ణ పారిశుధ్య సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రతి వ్యక్తి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యతివ్వాలన్నారు. పరిశుభ్రత ముందుగా మన ఇంటి నుండే ప్రారంభం కావాలన్నారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఏలూరు నగరపాలక సంస్థలో ఇంటింటికీ వెళ్లి చెత్తసేకరణ చేస్తున్నామని, ప్రతి ఒక్కరూ తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి చెత్తసేకరణ వాహనాలకు అందించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రతి ఒక్కరూ నిషేధించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఇఒ శ్రీహరి, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, జిల్లా పంచాయతీ అధికారి కె.అనురాధ, డిఎంహెచ్‌ఒ పిజె.అమృతం, డిసిహెచ్ఎస్ పాల్ సతీష్, అధికారులు పాల్గొన్నారు.

వ్యకాస జిల్లా మహాసభను జయప్రదం చేయాలి

సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వ్యకాస నాయకులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఈ నెల 27, 28వ తేదీల్లో టి.నరసాపురంలో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా 32వ మహాసభను జయప్రదం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో జిల్లా మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామీ, భూమి, పేదల ఇళ్ల స్థలాల సమస్యలపై నిరంతరం వ్యవసాయ కార్మిక సంఘం పని చేస్తోందన్నారు. సంఘం జిల్లా మహాసభ టి.నర్సాపురంలో మొట్టమొదటిసారిగా నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ ప్రాంతంలో మహాసభ నిర్వహించడం వల్ల ఈ ప్రాంత అభివృద్ధికి, రైతులకు, వ్యవసాయ కార్మికులకు, పేదలకు ఉపయోగపడతాయని తెలిపారు. గ్రీన్ ఫీల్డ్ రైతులు ఎదుర్కొన్న సమస్యలపై వారికి అండగా ఉంటూ పోరాడుతోందన్నారు. ఈ మహాసభ జయప్రదానికి ఉద్యోగులు, కార్మికులు, రైతాంగం, వ్యవసాయ కార్మికులు, వ్యాపారవేత్తలు విద్యావేత్తలు, ప్రజలు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

దేశ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

జాతీయ షెడ్యూల్డ్ ట్రైబ్స్ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్


మాట్లాడుతున్న జాటోత్ హుస్సేన్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను జాతీయ షెడ్యూల్డ్ ట్రైబ్స్ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ సోమవారం సందర్శించారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు బోధించి, కొన్ని ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థి దశ గోల్డెన్ రోజులని, ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు. విద్యార్థులకు వండిన ఆహార పదార్థాలను స్వయంగా రుచిచూచి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాల గృహాల్లో ఉండే విద్యార్థులకు ఇంటిని మరిపించేలా సకల సౌకర్యాలు కల్పించాలన్నారు. దోమలు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలని, వసతి గృహాల ఆవరణ, పరిసరాల్లో ఫాగింగ్ క్రమం తప్పకుండా చేయించాలని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యత ఉన్న పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు బోధన చేయాలన్నారు. క్రమం తప్పకుండా విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించాలన్నారు. మరుగుదొడ్లు, స్నానాల గదులు పూర్తి పరిశుభ్రతతో ఉండాలని, మరమ్మతులకు గురైతే వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. ఈ సమావేశంలో ఐటిడిఎ పిఒ కె.రాములునాయక్, ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి ఎం.ముక్కంటి, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి జి.త్రినాధబాబు, విద్యుత్ శాఖ ఇఇ ఫీర్ అహ్మద్ ఖాన్, గృహ నిర్మాణ శాఖ ఇఇ కెవివిఎస్.ప్రసాద్, డిప్యూటీ వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ సురేష్, మండల వివిధ శాఖల అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.రాంబాబు, ఉపాధ్యాయులు, ఐటిడిఎ ఉద్యోగులు, ఎస్‌టి సంఘాలు ప్రతినిధులు, నాయకులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

కొయ్యలగూడెం :ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యుడు జటోతు హుస్సేన్ నాయక్ పేర్కొన్నారు. పోలవరం నియోజకవర్గంలోని మన్యం ప్రాంతాల్లో పలు గ్రామాల పర్యటనకు వచ్చిన ఆయన కొయ్యలగూడెంలో ఏర్పాటుచేసిన పాత్రికేయ సమావేశంలో మాట్లాడారు. అన్ని తరగతుల ప్రజలు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. తమ కమిషన్‌కు ఫిర్యాదు అందిన వెంటనే విచారణ చేపడతామని తెలిపారు. దేశంలోని మొట్టమొదటిసారిగా గిరిజన మహిళను రాష్ట్రపతిగా నియమించిన ఘనత భారతదేశానికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

మెడికల్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి పోరాటం

ఎపి మెడికల్ ఎంప్లాయిూస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.లక్ష్మణమూర్తి

మెడికల్ ఎంప్లాయిూస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మణమూర్తి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న నర్సింగ్ స్టాఫ్, ల్యాబ్ టెక్నీషియన్లు, ఆఫీస్ స్టాఫ్ తదితర విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగ సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఎపి మెడికల్ ఎంప్లాయిూస్ యూనియన్ నిరంతరం పోరాడుతోందని ఎపి మెడికల్ ఎంప్లాయిూస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.లక్ష్మణమూర్తి తెలిపారు. సోమవారం ఏలూరు జిల్లా సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలో ఎపి మెడికల్ ఎంప్లాయిూస్ యూనియన్ బ్రాంచి ఎన్నికలు లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా లక్ష్మణమూర్తి మాట్లాడుతూ ఏలూరు జిల్లా కేంద్రం ఆస్పత్రిలో పనిచేస్తున్న మెడికల్ ఎంప్లాయిూస్ యూనియన్ నాయకులు ఉద్యోగ, సిబ్బంది సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. మెడికల్ ఎంప్లాయిూస్ యూనియన్ ఏలూరు జిల్లా కేంద్ర సర్వజన ప్రభుత్వ ఆసుపత్రి బ్రాంచ్‌కు 30 మందితో నూతన కమిటీ ఎన్నికైంది. అధ్యక్షులుగా ఎం.రవికుమార్, కార్యదర్శిగా డి.లక్ష్మణమూర్తి, కోశాధికారిగా వి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా టిఎస్.ఆచారి, ఎం.కిషోర్, బి.సందీప్, జి.రాజకుమార్, కె.మణి, కె.శేషు, సహాయ కార్యదర్శులుగా పి.అరుణ్‌గోపాల్, శేఖర్, ఎం.హరిబాబు, పి.లోకేష్, ఎన్.బేబీ అనురాధ, సిహెచ్ అశోక్ కుమార్ ఎన్నికయ్యారు.

ముదినేపల్లిలో వర్షం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో సోమవారం రాత్రి తొమ్మిది గంటలకు వర్షం కురిసింది. ఈ వర్షంతో రోడ్లు జలమయం కావడంతోపాటు పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరి ప్రజలు అవస్థలు పడ్డారు. అలాగే రోడ్లపై రాకపోకలు సాగించేందుకు పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడ్డారు. వర్షంతో పలు కాలనీల్లో, పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరింది. ముదినేపల్లితో పాటు మండలంలోని పలు గ్రామాల్లో వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి.

న్యాయం చేయాలని నిరసన

ప్రజాశక్తి - చింతలపూడి

కనకదుర్గ గోల్డ్ లోన్‌లో మోసపోయిన బాధితులు నిరసన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కనక దుర్గ గోల్డ్ లోన్ కార్యాలయం వద్ద రోడ్డు మీద బైఠాయించారు. సుమారు నెల రోజులు గడిచిందని, తమకు న్యాయం ఎప్పటికీ జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దొంగతనం జరిగి ఇన్ని రోజులైనా కనీసం సమాధానం చెప్పకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, బాధితులకు ఎలాంటి న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో చింతలపూడి సిఐ క్రాంతికుమార్ వారితో మాట్లాడి నెల 17వ తేదీ లోపు విజయవాడ మెయిన్ బ్రాంచ్ వారితో మాట్లాడి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో బాధితులు తమ ఫిర్యాదులను వారికి అందించారు.

నిరసన తెలుపుతున్న బాధితులు

రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు నూజివీడు విద్యార్థులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని బిస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సోమవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కృష్ణా జిల్లా బాస్కెట్‌బాల్ అండర్-14, అండర్-17 బాల బాలికల సెలక్షన్స్ నిర్వహించారు. ఈ సెలక్షన్స్‌లో ఎంపికైన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో కృష్ణా జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నూజివీడు ఉప విద్యాశాఖాధికారి పిఎస్.సుధాకర్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ రాంబాబు, బిసి స్కూల్ కరస్పాండెంట్ బి.శ్యామ్, వ్యాయామ ఉపాధ్యాయులు వాక నాగరాజు, ఎస్.లక్ష్మి, వి.వనజ, డి.సతీష్‌కుమార్, రవళి, బలరాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోసపూరిత లావాదేవీల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

మోసపూరిత లావాదేవీల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ జిల్లా ప్రజలకు సూచించారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎస్‌పి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలు మూలల నుంచి వచ్చిన 45 మంది తమ సమస్యలపై అర్జీలు అందించారు. దీనిలో ఎక్కువగా భూ వివాదాలు, కుటుంబ తగాదాలు, మోసపూరిత లావాదేవీలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి. ఎస్‌పి ప్రతి ఫిర్యాదుదారుని నేరుగా మాట్లాడి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని, ప్రతి ఫిర్యాదును చట్ట ప్రకారం విచారణ చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు తమ సమీపంలోని సిఐ, డిఎస్‌పి కార్యాలయాల్లో కూడా ఫిర్యాదు చేయవచ్చని, దీని వల్ల విలువైన సమయం, సొమ్ము వృధా కాకుండా ఉంటుందన్నారు. ప్రతి ఫిర్యాదు స్థితిగతులను 1100కు కాల్ చేసి తెలుసుకోవచ్చని సూచించారు.

జీలుగుమిల్లికి రెండు ఉత్తమ అవార్డులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర, జిల్లా స్థాయిలో పారిశుధ్య విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చడంతో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ స్వచ్ఛ గ్రీన్ అంబాసిడర్‌గా పి.అంకంపాలెం గ్రామానికి చెందిన ఎన్.సూరమ్మకు సిఎం చంద్రబాబు చేతులమీదుగా అవార్డ్ అందుకున్నారు. అదే విధంగా స్వచ్ఛ గ్రామ పంచాయతీగా కామయ్యపాలెం పంచాయతీ ఎంపిక కాగా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, కలెక్టర్ వెట్రిసెల్వి చేతుల మీదుగా అవార్డులు అందుకున్నట్లు ఎంపిడిఒ నిఖిల్ మధు శరణ్ తెలిపారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో అవార్డులు అందుకోవడం పట్ల మండలంలోని పలువురు అభినందనలు తెలిపారు.

పంటలకు మద్దతు ధర కల్పించాలి

రైతు సంఘం మండల మహాసభలో జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

మాట్లాడుతున్న శ్రీనివాస్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

అన్ని పంటలకు మద్దతు ధరలు కల్పించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని, గ్రీన్ ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్లు నిర్మించాలని ఎపి రైతు సంఘం జంగారెడ్డిగూడెం మండల మహాసభలో ఆ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకు మద్దతు ధరలు కల్పించాలని, మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెంలోని యుటిఎఫ్ కార్యాలయం హాలులో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల మహాసభ ఆ సంఘం మండలాధ్యక్షులు బోడిక రామచంద్రరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభలో రైతాంగ సమస్యలు చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతులు చేసిన సుదీర్ఘ పోరాటం ఫలితంగా రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేశారని గుర్తు చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేస్తామని, మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకొస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం ఉత్పత్తి ఖర్చు అదనంగా 50 శాతం కలిపి అన్ని పంటలకు మద్దతు ధరలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. మద్దతు ధరలు గ్యారెంటీ చట్టం తీసుకురావాలన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే సర్వీస్ రోడ్లు నిర్మించాలని, భూ నిర్వాసిత రైతులకు 2013 భూ సేకరణ చట్ట ప్రకారం న్యాయమైన పరిహారం అందించాలని కోరారు. అన్ని పామాయిల్ ఫ్యాక్టరీల పరిధిలో ఆయిల్‌పామ్ గెలలు ఏరివేత ఆపాలని, రైతులు గెలలు తోలిన వారం రోజుల లోపుగా పేమెంట్స్ ఇవ్వాలన్నారు. కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధరకు అనుసంధానిస్తూ ధర ఫార్ములా ప్రకటించాలన్నారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం రైతులంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సిఐటియు మండల కన్వీనర్ పసల సూర్యారావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిరిబత్తుల సీతారామయ్య మాట్లాడుతూ గ్రామస్థాయి వరకు రైతు సంఘాన్ని బలోపేతం చేయాలని కోరారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు తప్ప మరో మార్గం లేదన్నారు. అనంతరం మండలంలోని రైతాంగ సమస్యలపై పలు తీర్మానాలు ఆమోదించారు.

రైతు సంఘం మండల నూతన కమిటీ ఎన్నిక

ఎపి రైతు సంఘం మండలాధ్యక్షులుగా అనపర్తి వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శిగా బొడ్డు రాంబాబు, మండల ఉపాధ్యక్షులుగా బోడిక రామ చంద్ర రావు, గోలి నర్సిరెడ్డి, మండల సహాయ కార్యదర్శు లుగా మాండ్రు సూర్యచం ద్రం, అల్లూరి వెంకటరామ రాజు మరో ఏడుగులతో నూతన మండల కమిటీ ఎన్నికైంది.


వెంకటేశ్వరరావు

రాంబాబు

పట్టపగలే విద్యుత్ కాంతులు

ప్రజాశక్తి -ముదినేపల్లి


పగలే వెలుగుతున్న లైట్

మండలంలోని ముదినేపల్లి పంచాయతీ శివారు అన్నవరంలో సోమవారం పట్టపగలే వీధి దీపాల విద్యుత్ కాంతులతో వీరజిల్లుతున్నాయి. మధ్యాహ్నమైన వీధి దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. వీధి దీపాల నిర్వహణను కార్యదర్శి గాలికొదిలేసినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉన్నట్టు అన్నవరం గ్రామస్తులు చెబుతున్నారు. దీంతో వీధిదీపాలు రేయింబవళ్లు విద్యుత్ కాంతులు వెదజల్లుతూనే ఉన్నాయి.

ఎంపిడిఒను కలిసిన యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి - ముసునూరు

ఎంపిడిఒగా బాధ్యతలు చేపట్టిన పి.యేసుబాబును యుటిఎఫ్ మండల నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపిడిఒ మాట్లాడుతూ విద్యాబోధన అంటే తనకు ఎంతో ఇష్టమని, అవసరమైతే ఖాళీ సమయంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కావాల్సిన కెరీర్ గైడెన్స్ అందిస్తానని తెలిపారు. యుటిఎఫ్ మండలాధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.పద్మకిషోర్, గుడిమళ్ల రాంబాబు ఆధ్వర్యంలో ఏసుబాబును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెక్కపల్లి ప్రధానోపాధ్యాయులు షేక్ అల్లాబక్షు, సీనియర్ యుటిఎఫ్ నాయకులు కె.గాంగేయుడు, డి.బెనర్జీ, కె.రాజు, ఫ్రాన్సిస్, చిట్టిబాబు, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులు

విద్యార్థులు పోటీ తత్వంతో చదవాలి

పెట్ల పార్వతి 18 వర్ధంతి కార్యక్రమంలో ప్రముఖులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

విద్యార్థులు పోటీ తత్వంతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఉంగుటూరు ఎంఇఒ-2 పి.సాయిబాబు అన్నారు. పెట్ల పార్వతి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా కాగుపాడు జిల్లా పరిషత్ హై స్కూలులో ప్రత్యేక సెమినార్ నిర్వహించి చదువుల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆర్థిక బహుమతులు, విద్యాసామగ్రి ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం కాగుపాడు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. సమాచార విస్ఫోటనం- అసత్య ప్రచారాలు- విద్యార్థులపై ప్రభావం- పరిష్కారం మార్గాలు అనే అంశంపై పూర్వ జిల్లా జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు వీరాస్వామి మాట్లాడారు. పెట్ల పార్వతి 18వ వర్ధంతి సందర్భంగా కాగుపాడులో ప్రభుత్వ పాఠశాలల్లో 30 మంది విద్యార్థులకు ఆర్థిక సాయంతో పాటు విద్యాఉపకరణాలు ట్రస్ట్ అధ్యక్షులు పెట్ల కామేశ్వరరావు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కడియాల సుధేష్ణ, జనార్దన్‌రావు, దేవు సూర్యప్రకాశరావు, ఎం.రవిశంకర్, ఎస్.సత్యనారాయణ, ఆనందకుమార్, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

ప్రజాశక్తి - దెందులూరు

ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు అన్నసమారాధన వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. మండలంలోని అప్పన్నవీడులోని తాళ్లమూడిలో అభయాంజనేయ స్వామి ఆలయ ఛైర్మన్ వేమూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో 41 రోజుల పాటు అయ్యప్ప భవాని దీక్షదారులకు ఏర్పాటుచేసిన అన్న సమారాధన కార్యక్రమానికి దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని దీక్షదారులకు స్వయంగా ఎంఎల్‌ఎ భోజనాలను వడ్డించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా అయ్యప్ప భవానీ దీక్షదారులకు తమ దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయం వద్ద తాను అధికారంలో ఉన్నా లేకున్నా కూడా దీక్షాకాలంలో ప్రతినిత్యం స్వాములకు, భవానీలకు అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో సైతం కూటమి నాయకులు ప్రజాప్రతినిధులు ఈ విధంగా అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని చింతమనేని ప్రభాకర్ తెలిపారు.

నేరాలు - ఘోరాలు

బస్సు నుంచి జారి పడి మహిళకు గాయాలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఆర్‌టిసి బస్సు నుంచి జారి పడి మహిళ గాయాలపాలైంది. వివరాల ప్రకారం.. మండలంలోని రాజానగరం గ్రామానికి చెందిన గిరిజన మహిళ వెట్టి జయమ్మ దొండపూడి వెళ్లేందుకు ఆర్‌టిసి బస్సు ఎక్కింది. బస్సు లక్ష్మీపురం వద్ద ఉన్న కొవ్వాడ బ్రిడ్జి వద్దకు వెళ్లేసరికి జయమ్మ డోర్ వద్ద నుంచి ప్రమాదవశాత్తూ కింద పడడంతో వెనుక టైర్లు చేతిపై నుంచి వెళ్లాయి. దీంతో గాయాలపాలైన ఆమెను స్థానికులు ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరికి వచ్చే వరకు కనపడకపోవడంతో ఈ రోడ్లలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న పచ్చిముక్కలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన ప్రభుత్వం అందుకు సరిపడా బస్సులు లేకపోవడంతో రద్దీ ఎక్కువగా ఉండి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు.

పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వణుదుర్రు గ్రామానికి చెందిన బొర్రా వీర వెంకటేశ్వరరావు(54) హేమలత భార్యాభర్తలు. వీర వెంకటేశ్వరరావు మద్యానికి బానిసై ఎక్కువగా మద్యం తాగుతూ కొంతకాలం నుంచి కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. భార్య వద్ద డబ్బు లేకపోవడంతో ఆసుపత్రిలో చూపించలేకపోయారు. ఈ నేపథ్యంలో ఈ నెల మూడో తేదీ శుక్రవారం మధ్యాహ్నం వీర వెంకటేశ్వరరావు కడుపు నొప్పి భరించలేక చనిపోవాలని ఉద్దేశంతో ఇంట్లో ఉన్న దోమల మందు తాగి డబ్బా బయట పడేశాడు. ఇది గమనించిన కుమారుడు తండ్రిని గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించాడు. అప్పటి నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వీర వెంకటేశ్వరరావు పరిస్థితి విషమించి ఆదివారం మధ్యాహ్నం మృతి చెందినట్లు ఆసుపత్రి నుంచి సోమవారం వచ్చిన రిపోర్ట్‌పై హెచ్‌సి రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రైలు పట్టాలు దాటుతున్న ఒక వ్యక్తిని ప్రమాదవశాత్తు రైలు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు ఆదివారపువేటకు చెందిన మునిశెట్టి బంగారుబాబు (40) రజక కుల వృత్తిని కొనసాగిస్తూ జీవిస్తున్నాడు. అతని భార్య అనారోగ్యంగా ఉండడంతో బంగారుబాబు మానసికంగా ఎంతో వేదన పడుతూ మతి స్థిమితం కోల్పోయాడు. సోమవారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి గన్‌బజార్ వద్ద రోడ్డు కం రైల్వే బ్రిడ్జి వద్ద రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సమాచారం ఏలూరు రైల్వే పోలీసులకు అందడంతో రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

రెచ్చిపోతున్న రేషన్ బియ్యం మాఫియా

వేలిముద్రలు వేయించుకుని బియ్యం ఇవ్వని వైనం
విక్రయించుకుంటున్నారని లబ్ధిదారుల ఆవేదన
లింగపాలెంలో 600 కేజీల బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రతి ఒక్కరికీ రేషన్ బియ్యం అందించాలనే లక్ష్యానికి తూట్లు పడుతున్నాయి. చింతలపూడి, లింగపాలెం సరిహద్దు మండలాల్లో రేషన్ బియ్యం అక్రమ సరఫరా రోజురోజుకి పెరిగిపోతుంది. ఉన్నతాధికారుల నిఘా, పర్యవేక్షణ లేకపోవటంతో గ్రామస్తులు పట్టుకుని అధికారులకు సమాచారం ఇస్తున్న పరిస్థితి నెలకొంది. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న పరిస్థితి. 25 నుంచి 30 వరకు వృద్ధులకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నారు. దింతో రేషన్ బియ్యం వ్యాపారులకు అవకాశంగా మారింది. లింగపాలెం, చింతలపూడి మండలాలను అడ్డాగా మార్చుకుని వ్యాపారం సాగిస్తున్నారు. గత నాలుగు నెలల నుంచి రేషన్ బియ్యం మాఫియా రెచ్చిపోతుంది. ఎవరూ పట్టించుకోకపోవటంతో యథేచ్ఛగా రేషన్ బియ్యం సరఫరా చేస్తున్నారు. రేషన్ షాపు దుకాణదారులు లబ్ధిదారుల వద్ద నుంచి రూ.14 నుంచి రూ.16 వరకు వారే తీసుకుని రేషన్ బియ్యాన్ని అమ్ముకుంటున్నారని పలువురు చెబుతున్నారు. 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు వృద్ధులకు ఇచ్చే రేషన్ పంపిణీలో వృద్ధులకు ఇవ్వకుండా కేవలం వేలిముద్రలు వేసుకుని రేషన్ ఇవ్వకుండా వచ్చేస్తున్నారని, వారు ఎప్పుడు రేషన్ బియ్యం ఇస్తారని, తెలియడం లేదని వృద్ధులు చెబుతున్నారు. వృద్ధులకు వేలిముద్రలతో పాటు, కాట తీసుకెళ్లి, వెంటనే రేషన్ బియ్యం ఇప్పించాలని కోరుతున్నారు. లింగపాలెం మండలంలో రేషన్ బియ్యం పట్టుకున్నారు. స్థానిక యువత అధికారులకు పక్కా సమాచారం అందించటంతో సివిల్ సప్లై అధికారులు, ధర్మాజీగూడెం ఎస్ఐ, లింగపాలెం రెవెన్యూ సిబ్బంది, సుమారుగా 600 కేజీల రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యాన్‌ను, మోటార్ సైకిల్‌ను పట్టుకుని ధర్మాజీగూడెం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ రేషన్ తరలింపు వెనుక ఉన్న వ్యక్తి పరారైనట్లు తెలుస్తుంది. దీంతో ఒక పేరు మోసిన రాజకీయ నాయకుడు మంతనలు చేయటం మొదలు పెట్టినట్లు తెలుస్తుంది. జిల్లా అధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో ఇటు వంటి సంఘటనలు జరుగుతున్నాయిని స్థానిక యువత చెబుతున్నారు. దీనిపై చింతలపూడి సివిల్ డీటీని వివరణ అడుగగా 600 కేజీలు పట్టుకున్నామని తెలిపారు.

పట్టుకున్న రేషన్‌బియ్యం

మానసిక ఆరోగ్య దినోత్సవ వారోత్సవాలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఈ నెల ఆరు నుంచి పదో తేదీ వరకు జరుగుతున్న ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవ వారోత్సవాల సందర్భంగా జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ బల్లే చిన్నబాబు విద్యార్థులకు పది రకాల మానసిక ఆరోగ్య సూచనలు వివరించారు. ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, సరిపడా విశ్రాంతి తీసుకోవాలని, సమతుల ఆహారం తీసుకోవాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులతో బ్రీతింగ్ ఎక్సర్‌సైజులు చేయించారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు కూడా మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిమ్మలూరి ఉమాదేవి కౌన్సిలర్ బల్లే చిన్నబాబును అభినందించారు.

యానిమేటర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - నిడమర్రు

ఐకెపి యానిమేటర్స్ సమస్యలు పరిష్కరించాలని దేవున విజయలక్ష్మి డిమాండ్ చేశారు. నిడమర్రు ప్రజాసంఘాల కార్యాలయంలో ఐకెపి డ్వాక్రా యానిమేటర్ మండల కమిటీ సమావేశం సారిక లలిత అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, కనీస వేతన అమలు చేయాలని కోరారు. ఆన్‌లైన్ పనిభారం తగ్గించాలని. హెచ్‌ఆర్‌సి పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అక్టోబర్ ఏడో తేదీన ద్వారకాతిరుమలలో ఐకెపి డ్వాక్రా యానిమేటర్ జిల్లా మహాసభ జరుగుతుందని, పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. నిడమర్రు మండల కేంద్రంలో ఎపిఎంకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ సమావేశంలో సాయిభవాని, అచ్చాయమ్మ, కె.స్వరూప, దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆటల పోటీలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

స్కూల్ గేమ్స్ అండర్-14, అండర్-17 బాల బాలికలకు నూజివీడు పట్టణంలోని సెయింట్ థామస్ హై స్కూల్లో ఈ నెల 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్నట్లు బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.అనురాధ సోమవారం తెలిపారు. ఏడో తేదీన బాలుర ఆటలు, ఎనిమిదో తేదీన బాలికల ఆటలు, అథ్లెటిక్స్ పోటీలు, తొమ్మిదో తేదీన బాలుర అథ్లెటిక్స్ నిర్వహించనున్నట్లు చెప్పారు. సోమవారం సెయింట్ థామస్ హై స్కూల్ ఆవరణలో రెవరెండ్ బ్రదర్ కిషోర్‌తో సమావేశమై తీర్మానిం చారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్స్ నిర్వహించనున్నారు. వివరాలకు 9848094366, 9491726410.సంప్రదించాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పెదపాలపార్రు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఉన్న 11 కెవి పేరూరు ఫీడర్ పరిధిలోని రెడ్డిపూడి, పేరూరు గ్రామాల్లో మంగళవారం ఉదయం ఏడు గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు మండల విద్యుత్ శాఖ ఎఇ పూర్ణచంద్రరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పై గ్రామాల్లో విద్యుత్ లైన్లకు దగ్గరలో ఉన్న చెట్లను కొట్టనున్నట్లు, ఆయా గ్రామాల్లోని గృహ, వాణిజ్య, ఆక్వా విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

జిఎస్‌టి 2.0పై అవగాహన

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

సూపర్ జిఎస్‌టి- సూపర్ సేవింగ్ ద్వారా అన్ని తరగతుల వారికి లబ్ధి చేకూరుతుందని ఎంపిడిఒ నిఖిల్ మధు శరణ్ తెలిపారు. సోమవారం జిఎస్‌టి 2.0పై స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ నిఖిల్ మధు శరణ్ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిఎస్‌టి 2.0 కొత్త లక్ష్యాలు, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. జిఎస్‌టి తగ్గింపు వల్ల ప్రజలకు కలిగే లబ్ధిని గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ప్రజలకు కలిగే లబ్ధిని తెలియచేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ బుచ్చయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కూటమి కృషి

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని టిడిపి నాయకులు ఘంటా సతీష్ తెలిపారు. బందంచర్ల గ్రామంలో ఆటో డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సతీష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా అర్హత కలిగిన ఆటో డ్రైవర్లందరికీ రూ.15 వేలు ఇచ్చి ఆర్థిక భరోసా కల్పించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి విద్యా సాగర్, ఓబిళ్లనేని శ్రీనివాసరావు, నాయుడు ధర్మరాజు, కొక్కిరిగడ్డ బాల స్వామి, ఉప్పులూరి సతీష్, మారుమూడి ఇస్రాయేలు, కాకి నాగేశ్వరరావు, గుడిమెట్ల రాంబాబు, వీరంకి నాగేశ్వరరావు, నత్తా మిషక్ పాల్గొన్నారు.

నివాస స్థలాల భూములు

నిషేధిత జాబితా నుంచి తొలగించాలి

ప్రజాశక్తి - నిడమర్రు

వినతి అందిస్తున్న గ్రామస్తులు

నివాస స్థలాల భూములు నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కోరుతూ మండలంలోని పత్తేపురం గ్రామ ప్రజలు సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ గవర సత్యనారాయణ మాట్లాడుతూ 1956 నుంచి చట్టపదంగా రిజిస్ట్రేషన్ కొనసాగుతున్న నివేషన ఇళ్ల స్థలాలు 225./1 సర్వే నెంబర్ మరి కొన్ని సర్వే నెంబర్ భూములను 2015 నుంచి ప్రభుత్వం నిషేధిత జాబితా (బ్లాక్ లిస్టులో) పెట్టిందని, గతేడాది సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్, అధికారుల దృష్టికి వెళ్లిన కొన్ని సర్వే నెంబర్ బ్లాక్ లిస్టు తొలగించారని చెప్పారు. మరి కొంతమందికి సంబంధించిన ఇళ్ల స్థలాలు ఇంకా బ్లాక్‌లిస్టులో ఉన్నాయని, అవి వెంటనే నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కోన శ్రీనివాసరావు, సిఐటియు మండల కన్వీనర్ కానూరు రాజు, నంబూరు హరికృష్ణ, వేగేశ్న సూర్యనారాయణ, కె.సత్యవతి, శ్రీజ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

నిర్ణీత సమయంలో సమస్యలు పరిష్కారం

నూజివీడు సబ్ కలెక్టర్ బి.వినూత్న

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

అర్జీ స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ వినూత్న

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు అర్జీల ద్వారా అందించిన సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించనున్నట్లు సబ్ కలెక్టర్ బి.వినూత్న తెలిపారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో సోమవారం మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. నూజివీడు రెవెన్యూ డివిజన్ పరిధిలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సబ్ కలెక్టర్‌కు అందించారు. ఈ సందర్భంగా సబ్ వినూత్న మాట్లాడుతూ ప్రతి అర్జీ ఆన్‌లైన్ చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోపు అన్ని సమస్యలు పరిష్కరించనున్నట్లు తెలిపారు. జఠిలమైన సమస్యలు పరిష్కారం కాకుంటే వాటి వివరాలను అర్జీదారులకు వివరిస్తామన్నారు. రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రజలు మొత్తం 39 రకాలైన సమస్యలను అర్జీల రూపంలో అందించినట్లు తెలిపారు. వివిధ శాఖలకు చెందిన డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం మండలాభివృద్ధికి మరో ముందడుగు

షాపింగ్ కాంప్లెక్స్, ఫైర్‌స్టేషన్‌కు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెం మండలాభివృద్ధి దిశగా మరో ముఖ్యమైన అడుగు పడింది. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే క్రమంలో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, సంబంధిత శాఖ మంత్రుల ఆధ్వర్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని, మండల కేంద్రంలో షాపింగ్ కాంప్లెక్స్, ఫైర్ స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు తెలిపారు. ఈ ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన అప్రూవల్ ఆర్డర్స్ ఇప్పటికే పంపిణీ చేసినట్లు ఆయన వెల్లడించారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఎన్‌డిఎ ప్రభుత్వం వేగంగా అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తోందని చెప్పారు.

వాలంటీర్ ఉపాధ్యాయుల ఏర్పాటు


వాలంటీర్ ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - కుక్కునూరు

ఏజెన్సీ ప్రాంతంలోని కుక్కునూరు గ్రామంలో ప్రభుత్వ పాఠశాలల ప్రారంభం నుంచి సుమారు ఐదు నెలలు ఉపాధ్యాయులు లేకపోవడంతో పేద విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారు. రాజకీయ నాయకులు, అధికారులు జిల్లా స్థాయి అధికారులకు సమస్య తెలియజేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఈ సందర్భంగా ఉప్పేరు గ్రామానికి చెందిన స్థానిక దాతలు చల్లా కోటేశ్వరరావు, పోలిబోయిన రమేష్ ముందుకు వచ్చి, పిల్లల భవిష్యత్తు కోసం వాలంటీర్ ఉపాధ్యాయులను ఏర్పాటు చేశారు. వారికి నెలకు ఒక్కొక్కరికి రూ.ఐదు వేలు జీతంగా చెల్లిస్తున్నారు. ఇటువంటి అరుదైన దాతలను గ్రామస్తులు, తల్లిదండ్రులు, విద్యార్థులు కృతజ్ఞతలతో కొనియాడారు.

మనస్తాపంతో యువకుడు ఆత్మహత్యాయత్నం

కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

ఏలూరు నగరానికి చెందిన ఒక యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా ఏలూరు త్రీటౌన్ పోలీసులు సకాలంలో స్పందించి అతడిని రక్షించారు. ఏలూరు త్రీటౌన్ సిఐ కోటేశ్వరరావు యువకుడిని తల్లితండ్రులకు అప్పగించారు. ఏలూరు బీడీ కాలనీకి చెందిన యువకుడు షేక్ ఉమర్ ఫారూఖ్ స్థానికంగా ఒక ప్రయివేట్ కంపెనీలో బాయ్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ ఏడాది ఫిబ్రవరిలో అతనికి వివాహమైంది. ఇటీవల ఉమర్ ఫారూఖ్ అతని భార్యకు మధ్య చిన్నపాటి మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. భార్య తన తల్లి ఇంటికి వెళ్లడం ఒంటరిగా ఉండటంతో తీవ్ర మానసిక ఒత్తిడికి లోనయ్యాడు. జీవితంపై విరక్తితో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఏలూరు జ్యూట్‌మిల్లు సమీపంలోని రైలు పట్టాలపైకి వెళ్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడబోగా 112 కంట్రోల్ రూమ్‌కు అందిన సమాచారంతో తక్షణమే స్పందిస్తూ ఏలూరు త్రీటౌన్ సిఐ కోటేశ్వరరావు పర్యవేక్షణలో ఏలూరు త్రీటౌన్ ఎస్ఐ రాంబాబు ఆధ్వర్యంలో కానిస్టేబుల్ నరేంద్ర సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడు ఫారూఖ్‌ను రక్షించారు. అతడిని త్రీటౌన్ స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచి తల్లిదండ్రులకు అప్పగించారు. తమ కుమారుడిని రక్షించిన ఏలూరు త్రీ టౌన్ పోలీసులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీ

ప్రజాశక్తి - ముసునూరు


కళ్లజోళ్లు అందుకున్న విద్యార్థులు

లయన్స్ క్లబ్ విజయవాడ రూరల్ వారి ఆధ్వర్యంలో గత నెల 18వ తేదీన చెక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 400 మంది విద్యార్థులకు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించారు. సోమవారం ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత కొత్తపల్లి పూర్ణచంద్రరావు, నరసింహారావు క్లబ్ ప్రతినిధుల ఆధ్వర్యంలో 75 మంది విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో కొన్ని మొక్కలు నాటారు. పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థులకు ఇంత మంచి కార్యక్రమం చేపట్టిన లయన్స్ క్లబ్ ప్రతినిధులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ అల్లా బక్ష అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ జి.పద్మకిషోర్, ఉపాధ్యాయులు గుడిమెళ్ల రాంబాబు, శివ నాగమణి, కళాధర్, అబ్రహం, మురళి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యాన సంతకాల సేకరణ

ప్రజాశక్తి - కలిదిండి

ఓటు చోరీ కార్యక్రమంలో భాగంగా ప్రధాన సెంటర్‌లో కాంగ్రెస్ నాయకులు సంతకాల సేకరణ చేపట్టారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు చోరీ అనేది దారుణమని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్ మోహనరావు అన్నారు. ప్రజల ఓటు హక్కును కాపాడుకునేందుకు కాంగ్రెస్‌కు మద్దతు తెలపాలని నాయకులు కోరారు. తొలుత ప్రధాన సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి పర్యటించారు. కైకలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొడ్డు నోబుల్, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఈదా పద్మారావు, మారుబోయిన జై శ్రీనివాస్, కైకలూరు, మండవల్లి అధ్యక్షులు కె.పుల్లయ్య, బుర్ల కృష్ణ, నాయకులు దండే సైమన్‌రాజు, పి.విల్సన్, శేషగిరి, సామ్యూల్, వరిగంజి రెడ్డి పాల్గొన్నారు.

కొమ్మారెడ్డివారి సేవాగుణం అభినందనీయం

ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - దెందులూరు

కొమ్మారెడ్డివారి సేవాగుణం ఎంతో అభినందనీయమని, వారి తాత ముత్తాతల నుంచి వస్తున్న సేవాగుణాన్ని ఆదర్శంగా తీసుకుని సాటి మనుషులకు సాయం చేయడం కోసం, పోతునూరు గ్రామ అభివృద్ధి కోసం ఎల్లప్పుడు ముందుండే నిగర్వి, మానవతా మూర్తి కొమ్మారెడ్డి రాంబాబు అని, వారి సేవలను స్ఫూర్తిగా తీసుకుని మరెంతో మంది ప్రముఖులు ప్రభుత్వం చేపట్టిన పి-4 కార్యక్రమంలో భాగమై సమాజ ప్రగతికి దోహదపడాలని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. మండలంలోని పోతునూరు గ్రామంలో కొమ్మారెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కీర్తిశేషులు కొమ్మారెడ్డి సదాశివరావు జ్ఞాపకార్థం వారి కుమారుడు కొమ్మారెడ్డి రాంబాబు ఆర్థిక సహకారంతో రూ.50 లక్షలు వెచ్చించి పోతునూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిర్మించిన అదనపు భవనం (మల్టీపర్పస్ హాల్), జిల్లా పరిషత్ హై స్కూల్‌లోని సైకిల్ స్టాండ్ సహా నూతనంగా ఏర్పాటు చేసిన పలు మౌలిక సదుపాయాలను కార్యక్రమ విశిష్ట అతిథి, స్వచ్ఛంద కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభితో కలిసి దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ మండలంలోని పోతునూరు గ్రామం ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుందని, ఈ గ్రామం నుంచి పలువురు మంత్రులుగా, ప్రజాప్రతినిధులుగా ఎన్నో కీలక బాధ్యతలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని చెప్పారు. విశిష్ట అతిథి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి మాట్లాడుతూ పోతునూరు గ్రామ అభివృద్ధిలో కొమ్మారెడ్డి వారి ముద్ర ఎప్పుడూ ఉంటుందన్నారు. పోతునూరు లోని స్థానిక చెరువు ప్రక్షాళనకు అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో శుభ్రత కార్యక్రమం చేపడతామని తెలిపారు. కొమ్మారెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు కార్యక్రమ దాత కొమ్మారెడ్డి రాంబాబు మాట్లాడుతూ సొంత గ్రామానికి సాయం చేయటం పెద్ద గొప్పగా తాము భావించటం లేదన్నారు. దాత కొమ్మారెడ్డి రాంబాబును, వారి కుటుంబ సభ్యులను, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిని, దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్‌ను కూటమి నాయకులు, గ్రామస్తులు ఘనంగా సత్కరించారు.

డాక్యుమెంట్స్ పోయినవి

పశ్చిమగోదావరి జిల్లా, పాలకొల్లు మండలం, ముచెర్ల వారి లేఅవుట్, 12th వార్డు కి చెందిన చేగొండి సతీష్ కుమార్, S/o. స్వామి నాయుడు అను నా యొక్క ఒరిజినల్ **7867/2011** నెంబర్ గల డీడ్ డాక్యుమెంట్స్ పడిపోయినవి. ది 21-09-2025 తేదీన నా ఇంటి వద్ద నుంచి **7867/2011** నెంబర్ గల ఒరిజినల్ డీడ్ డాక్యుమెంట్స్ తీసుకొని పాలకొల్లు సెంటర్ కి జిరాక్స్ తీపించు నిమిత్తం నా యొక్క మోటారు సైకిల్ మీద వెళ్ళు చుండగా, దారి మధ్యలో పడిపోయినవి. ఎంత వెతికిన దొరకలేదు. దొరికిన వారు ఈ క్రింది అడ్రస్ కి తెలియజేయగలరు.

చేగొండి సతీష్ కుమార్
S/o. స్వామి నాయుడు
D.No: 27-1-101/A
ముచెర్ల వారి లేఅవుట్
పాలకొల్లు మండలం, ప॥గో॥జిల్లా

దావా సమన్సు (Or. 5 R. 1 & 5)
చీరాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో,
O.S.No. 33/2025

Between:
బ్యాంకు ఆఫ్ బరోడా, చింతగుంపల్లి,
రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్ .....వాది
మరియు
M/s Satya Granites & Exports,
రిప్రజెంటెడ్ బై ఇట్స్ ప్రొప్రైటర్ కల్లపల్లి రామలక్ష్మి .....ప్రతివాది

To
M/s Satya Granites & Exports, రిప్రజెంటెడ్ బై ఇట్స్ ప్రొప్రైటర్ కల్లపల్లి రామలక్ష్మి, W/o తరుణ్, 31 సం.లు, నివాసం ఇసుకవాగు సెంటర్. అంకమ్మ గుడి ప్రక్కన, ఒంగోలు,
ప్రస్తుత నివాసం : డోర్ నెం.4-12, యర్రావుల వీధి, చేబ్రోలు, పశ్చిమ గోదావరి జిల్లా.

పై నెంబరు దావాని వాది అయిన బ్యాంకు వారు ప్రతివాది అయిన నీనుండి బ్యాంకుకు రావలసిన లోను బకాయిని రాబట్టుకొను నిమిత్తం దాఖలు చేసియున్నారు.ఇందు నిమిత్తమై నీకు ఏమైనా అభ్యంతరములు ఉన్నయెడలది.29-10-2025వ తేదిన ఉదయం 10.30 ని.లకు పై కోర్టు వారి యెదుట స్వయంగా కానీ, లేదా వకీలు ద్వారా కానీ హాజరై మనవి చేసుకొనవలెను, లేనిచో నీ పరోక్ష మందు విచారించి తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

కోర్టు వారి ఆదేశాల ప్రకారము ప్రకటన జారీ చేయువారు
బండారుపల్లి హేమంత కుమార్,
బి.కాం, బి. యల్.
అడ్వకేట్ & నోటరి (భారత ప్రభుత్వం)
చర్చి కంపౌండ్, చీరాల 523 157
సెల్ : 9440242350.